ప్రజాశక్తి
మంగళవారం 16 మే 2023

ఎపిఇఎపి ప్రవేశ పరీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపిసెట్ సోమవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్ విధానంలో ఏడు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రోజుకు రెండు విడతల చొప్పున ఈ పరీక్షలు జరుగుతాయి. 15 నుంచి 19 తేదీల్లో ఇంజినీరింగ్, 22, 23 తేదీల్లో వ్యవసాయం/ఫార్మసీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్‌కు 8,202, వ్యవసాయం/ఫార్మసీకి 3,883 మంది పోటీ పడుతున్నారు. జిల్లాలోని సీతం, ఎంవిజిఆర్, లెండీ, జిఎంఆర్, స్వామి వివేకనంద కళాశాలల కేంద్రాల్లో పరీక్ష జరిగింది.

పరీక్ష రాసిన అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

ఐదు నెలలుగా కొనుగోలు చేయని టిటిడి
'జగనన్నకు చెబుదాం' అంటూ కలెక్టరేట్‌కు నాలుగోసారి వచ్చిన కర్షకులు
ఆశ పెట్టి మోసం చేశారంటూ ఆవేదన

స్పందనలో ఫిర్యాదు అనంతరం బెల్లం చూపుతున్న రైతులు

బెల్లం రైతుల్ని ముంచేశారు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో గడిచిన నాలుగేళ్లగా సేంద్రియ వ్యవసాయం పెరుగుతోంది. గతంలో పాచిపెంట మండలంలో సేంద్రియ ఎరువులతో సాగుచేసిన పత్తి విదేశాలకు ఎగుమతి చేయడం, ఇక్కడి పత్తితో తయారు చేసిన టీషర్ట్లకు ఎంతో గిరాకి ఉండడం వంటి వార్తలు విధితమే. దీంతో, పత్తికి మంచి గిరాకీ కూడా పెరిగింది. అదే మాదిరిగా జిల్లాలో సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న చెరకుతో తయారు చేసిన బెల్లాన్నీ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన తయారు చేస్తున్న లడ్డూలకు ఉపయోగిస్తామంటూ గడిచిన ఫిబ్రవరిలో అప్పటి కలెక్టర్ ఎ.సూర్యకుమారి అభయం ఇచ్చారు. ఆమె ఆదేశాలతో బొబ్బిలి మండలం కోమటిపల్లి, బాడంగి మండలం ముగడ గ్రామాల్లోకి వచ్చిన వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ అధికారులు అప్పటికే ఆయా గ్రామాల్లో తయారుచేసిన బెల్లాన్ని టెస్టింగ్ కోసం టిటిడి దేవస్థానానికి పంపారు. నాణ్యత బాగానే ఉందని అక్కడి నుంచి సమాచారం అందినట్టుగా రైతులకు చెప్పారు. దీంతో, సేంద్రియ ఎరువులతో చెరకు సాగుచేస్తున్న రైతులను కలిసి సాగు పద్ధతులు మొదలుకుని, బెల్లం తయారీ, అచ్చుల పరిమానం వరకు రకరకాల సూచనలు చేశారు. అధికారులు ఎంతో శ్రద్ధ చూపుతూ దగ్గరుండి ఇ-క్రాప్ కూడా నమోదు చేశారు. బ్యాంకు ఖాతా నెంబర్లు కూడా తీసుకున్నారు. దీంతో, రైతులు సాగు మొదలుకుని, బెల్లం తయారీ, బెల్లం అచ్చుల సైజు వరకు అధికారులు సూచించిన పద్ధతిలో గత ఏడాది డిసెంబర్ నాటికి బెల్లం తయారు చేశారు. నాటి నుంచి నేటి వరకు అదుగో ఇదిగో అంటూనే నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాలకు చెందిన రైతుల వద్ద సుమారు 50 టన్నుల బెల్లం నిల్వ లు ఉన్నాయి. దీంతో, బెల్లాన్ని నిల్వ చేసుకునేందుకు చోటు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. శీతలగిడ్డంగుల సదుపాయం కూడా ప్రభుత్వం తరపున కల్పించకపోవడంతో బెల్లపు అచ్చుల్లో తరుగు కనిపిస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేజీ రూ.80 చొప్పున కొనుగోలు చేస్తామంటూ అధికారులు ఆశ చూపించారని, వారి సూచనల మేరకు ఇంతకు ముందు 15కేజీల పరిమాణంలో తయారుచేసిన బెల్లపు అచ్చులను 1కేజీ చొప్పున తయారు చేశామని చెబుతున్నారు. ఇందుకోసం సమయం, శ్రమ ఎక్కువైందని, ప్యాకింగ్ తదితరాలకు కూలీలను కూడా పెట్టుకున్నామని, మదుపు కూడా రూ.లక్షల్లో అయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టుకోలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఉలుకూ పలుకూ లేదు. దీంతో, కోమటిపల్లికి చెందిన అట్టాడ రాములు, అట్టాడ తిరుపతిరావు, నారాయణ, లక్ష్మీకాంతం, మాదవరావు ముగడ గ్రామానికి చెందిన మరికొంతమంది రైతులు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబును కూడా కలిసి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఎందుకు కొనుగోలు చేయడం లేదో చెప్పాల్సిన అధికారులు రిలయన్స్, మోర్ వంటి కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తామంటూ చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థలు రూ.80చొప్పున కొనుగోలు చేస్తాయా? అంటూ ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా కేజీల చొప్పున తయారు చేసి నాలుగైదు నెలలు కావడంతో పెచ్చులు ఊడి రంగుమారి పోయాయని, ఈ పేరుతో ఆయా సంస్థలు ధర తగ్గించే ప్రమాదం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశామని, అయినా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని కంటతడిపెట్టారు.

> 'మీరు తయారు చేస్తున్న బెల్లం ఏకంగా వెంకటేశ్వర స్వామి (తిరుమల తిరుపతి దేవస్థానం) ప్రసాదం లడ్డూ తయారీకి ఉపయోగిస్తామంటూ ఆశలు కల్పించిన అధికార యంత్రాంగం చివరికి మోసం చేసిందంటూ జిల్లాలోని కొంతమంది బెల్లం రైతులు లబోదిమంటు న్నారు. బెల్లం తయారు చేసి ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కొనుగోలు చేయలేదని, ఇప్పటి వరకు అదుగో ఇదిగో చివరకు రిలయన్స్, మోర్‌వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని, అదే జరిగితే తమకు నష్టమే తప్ప లాభం వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. తమ సమస్య పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'కు వచ్చిన బెల్లం రైతులు ప్రజాశక్తి ఎదుట తమ ఆవేదన వెళ్లగక్కారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో గోవుకు ఇచ్చిన రక్షణ మహిళలకు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని అన్నారు. ఒలింపిక్స్‌లో ఎన్నో పథకాలు సాధించిన రెజ్లర్లు గత 23 రోజులుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద అందోళన చేస్తున్నా కేంద్ర బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ పై పోక్సో కేసు చట్టం కింద కేసు పెట్టినప్పటికే కేవలం తన పార్టీ ఎంపి కావడంతో ప్రధానమంత్రి నోరు మెదపకపోవడం బాధాకరమైన విషయమన్నారు. రెజ్లర్లకు అన్యాయం జరిగినప్పుడు స్పందించని బిజెపి ప్రభుత్వం సామాన్య మహిళలకు రక్షణ కల్పిస్తుందా అని ప్రశ్నించారు. ఈనేపథ్యంలో రెజ్లర్లకు మద్దతుగా ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 18న ఆలిండియా పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్త నిరసన కార్యక్రమాలు, 20న 2కె రన్ కార్యక్రమాలకు జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సతీష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి రమణ, ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాసరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, జెవివి నాయకులు రాజశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు వాసు, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రవి, నాయకులు సమీరా,లావణ్య, కళ్యాణి, ఎర్రమ్మ, వెంకటేష్, డి వైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నిరసన దీక్ష

నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

సిటియు స్థలాన్ని సిద్ధం చేయండి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సేకరించిన స్థలాన్ని అప్పగించడానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ట్రైబల్ యూనివర్సిటీ స్థలంలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి, తన ఛాంబర్‌లో సోమవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం కోసం రెండు మండలాల్లోని చినమేడపల్లి, మర్రివలస గ్రామాల పరిధిలో మొత్తం 561.891 ఎకరాల భూమిని సేకరించినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చెప్పారు. భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం దాదాపు పూర్తి అయ్యిందని, చెట్లకు సంబంధించి మాత్రమే బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సేకరించిన స్థలంలో రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాన్ని కల్పించేందుకు తక్షణమే పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమికంగా విద్యుత్ సరఫరా కోసం మంజూరైన రూ.48 లక్షలతో పనులను మొదలు పెట్టాలన్నారు. అడ్డుగా ఉన్న రెండు విద్యుత్ టవర్లను తొలగించాలని ఎపి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సుమారు రూ.16కోట్లతో ప్రతిపాదించిన ఆరులైన్ల రహదారి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. నీటిసరఫరా కోసం రూ.7కోట్లతో ప్రతిపాదించిన పనులను ప్రారంభించాలని, రక్షిత నీటి పథకంతోపాటు, ఐదు బోర్లు వేసే పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యుఎస్‌ను కలెక్టర్ ఆదేశించారు. ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టమణి మాట్లాడుతూ, ఈ యూనివర్సిటీ రాష్ట్ర విద్యార్థులకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య ఇక్కడి విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమాశంకర్, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ నాగేశ్వర్రావు, ఆర్‌అండ్‌బి ఇఇ రమణ, ట్రాన్స్‌కో ఇఇ శ్రీచరణ్, కలెక్టరేట్ జి. సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

17న నగరంలో సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమం - లైఫ్ - పర్యావరణం కోసం జీవనశైలి) లో భాగంగా ఈనెల 17న నగరంలో ఒక సైకిల్ ర్యాలీ చేపట్టనున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ బి.సుదర్శనం తెలిపారు. ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని ఏర్పరచుకునే దిశగా ప్రజలను సమాయత్తం చేయడమే ఈ ఉద్యమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వంద కోట్ల మంది భారతీయులను ఈ కార్యక్రమం కోసం సమీకరించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇంధన పొదుపు, జలసంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సుస్థిర ఆహార విధానాలు పాటించడం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకర జీవన విధానాలను అవలంభించడం, ఇ-వ్యర్థాల తగ్గింపు వంటి ఏడు అంశాలపై దృష్టి సారించి అవగాహన కలిగించనున్నట్టు పేర్కొన్నారు. వ్యక్తుల జీవనశైలిలో మార్పు తేవడం ద్వారా వాతావరణ మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.నగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 6.30 గంటలకు ర్యాలీ ప్రారంభమై గంటస్థంభం, అంబేద్కర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మయూరి జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్‌కు 7.30 గంటలకు చేరుతుందన్నారు. ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ధర్మపురి ప్రాంతంలో పలు వీధుల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూనే లబ్ధిదారులకు ఇంతవరకు ఏ మేరకు ప్రభుత్వం నుండి లబ్ధి చేకూరిందో వివరించే బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలు ఉంటే చెప్పాలని ప్రజలను కోరారు. కొంతమంది మహిళలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకురాగా త్వరలోనే వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తవుతుందని, ముషిడిపల్లి నుండి ప్రత్యేక పైప్‌లైను ఏర్పాటు చేసి తద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపుతున్నామని తెలిపారు. కాలువలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు, జోనల్ ఇన్‌ఛార్జి మారెం బాల బ్రహ్మ రెడ్డి, జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, డివిజన్ అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కోలగట్ల

'స్పందన' ఫిర్యాదులపై చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. బాధితుల సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం 36 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐ ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్‌ఐలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

స్పందనకు 122 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు 122 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పద్మలీల, బిఎస్ఎన్ దొర తదితరులు వినతులు స్వీకరించారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయండి

జనావాసాల మధ్య నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్‌లను మీరైనా సీజ్ చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం యుఎస్ రవికుమార్, రెడ్డి శంకర్రావు స్పందనలో వినతి అందజేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను పిలిచి దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. వినతినిచ్చిన వారిలో విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

సమగ్ర భూ హక్కులు ఇవ్వాలి

సమగ్ర భూ హక్కులు రైతులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. స్పందనలో జెసికి ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యాన వినతి అందజేశారు. వినతి అందజేసిన వారిలో లోకవరపు అది నారాయణమూర్తి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేమలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి

స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులు పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్న తర్వాత ఆయా పరిష్కారంపై అర్జీదారుల్లో అసంతృప్తి వ్యక్తమైతే అటువంటి వినతులను మళ్లీతెరచి పరిష్కరించాల్సి వుంటుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో స్పందన, ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందుతున్న వినతులకు సంబంధించి అర్జీదారుల్లో వాటి పరిష్కారం పట్ల సంతృప్తి వ్యక్తం కావడం లేదని దీనిపై అధికారులంతా ఆలోచించాలని అన్నారు.

యునిసెఫ్ పోస్టర్లు ఆవిష్కరణ

రాష్ట్రంలో బాల్యవివాహాలు నిరోధించడం, బాలికల ఆరోగ్యం, విద్యపై రూపొందించిన పోస్టర్లు, బాలికల్లో పోషకాహార లోపం నివారణ, బాలలు, యుక్త వయస్సు వారిని మాదకద్రవ్యాలకు దూరంగా వుంచడం తదితర అంశాలపై అవగాహన కల్పించే దిశగా యునిసెఫ్ (ఐక్యరాజ్యసమితి బాలల విద్య అభివృద్ధి నిధి) రాష్ట్ర ప్రభుత్వంతో కలసి రూపొందించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ తదితరులు విడుదల చేశారు. కార్యక్రమంలో సామాజిక పరివర్తన, ప్రచార సమన్వయకర్త బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా నాడు-నేడు పనులు పూర్తి

మనబడి నాడు-నేడు 2వ దశ పనులను పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సివిల్ వర్క్స్ అన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి కావాలని, పాఠశాలలు ప్రారంభం అయ్యాక విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు కోచింగ్ కేంద్రాలకు వచ్చేలా చూడాలని తెలిపారు. ఫెయిల్ అయిన వారి వివరాలను వాలంటీర్లకు ఇచ్చి వారి ద్వారా తల్లి దండ్రులకు కోచింగ్ గురించి వివరించి ఒప్పించాలన్నారు. 10వ తరగతి అన్నిటికి బేసిక్ అర్హత కావునా కనీసం 10 పాస్ అయ్యేలా చూడాలని అన్నారు. ఎంఇఒ,ఎంపిడిఒ, ప్రత్యేకాధికారులు దీనిని పర్యవేక్షించాలని, మరో 15రోజుల్లో కోచింగ్ పూర్తి అవుతున్నందున వెంటనే స్పందించాలని తెలిపారు. జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ఉప కలెక్టర్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు చెబుతున్న వృద్ధుడు

రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్‌పోటీలకు 13మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా యూత్ బాక్సింగ్ (మెన్) క్రీడాకారుల ఎంపిక సోమవారం స్థానిక రాజీవ్ స్టేడియంలో జరిగింది. సుమారు 70 మంది బాలురు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుండి 21 వరకు విశాఖపట్నంలో రైల్వే స్టేడియంలో జరుగు రాష్ట్రస్థాయి యూత్‌బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొంటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఇ రాజు, డి. మురళి, బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ వి. సంతోష్ కుమార్, పి. శ్రీనివాస రావు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిల్లలు ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలుగు ఉపాధ్యాయులు ఆర్.ఈశ్వరరరావు అన్నారు. సోమవారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా వివిధ ఉపాధ్యాయులు పుస్తక పఠనంపై సమావేశం నిర్వహించారు. దాని ఆవశ్యకత, ప్రయోజనాలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు 45మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ బి.లక్ష్మి , గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలకు కాంగ్రెస్ పెద్దపీట

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి కర్నాటక ఎన్నికల్లో పెద్దపీట వేయడం గొప్ప విషయమని ఎపిసిసి మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్ తెలిపారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో షరీఫ్ మాట్లాడుతూ కర్ణాటక లో జరిగిన ఎన్నికలో 15మంది ఎమ్మెల్యే అభ్యర్థులు నిలబటెట్టి గెలిపించడం గర్వంగా ఉందని అన్నారు. ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. 2024లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడం ఖాయమని అన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెప్మా టిఎల్‌ఎఫ్ అండ్ ఎస్‌ఎల్‌ఎఫ్ రిసోర్స్ పర్సన్లకు మెప్మా, ఇతర ప్రభుత్వ పథకాలు, వాటి అమలుపై 2 రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం యూత్ హాస్టల్ లో ప్రారంభమైంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించి మొత్తం 400 మందికి రెండు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నారు. మెప్మా పీడీ బి.సుధాకర రావు ఈ శిక్షణను ప్రారంభించారు.

ర్యాలీలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

టిడిపి ర్యాలీలో అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

బిజెపి, వైసిపి ప్రభుత్వాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చేపట్టిన వంద రోజులైన సందర్భంగా సంఘీభావంగా సోమవారం టిడిపి ఆధ్వర్యాన నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. కోట జంక్షన్ ఉన్న ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ప్రజలంతా మన దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ చట్టాలను తుంగలో తొక్కేస్తున్నాయని అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. మన రాష్ట్ర ప్రత్యేకత ఏంటంటే 16 నెలలు జైల్లో ఉన్న దొంగను ముఖ్యమంత్రి చేశారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నాయకులు కంది మురళీనాయుడు, కనకల మురళీమోహన్, కర్రోతు నర్సింగరావు, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు పోటెత్తిన జనం

బొబ్బిలి : యువ దళం పాదయాత్ర 100రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బొబ్బిలిలో చేపట్టిన పాదయాత్రకు జనం పోటెత్తారు. కోటలో పాదయాత్రను మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు ప్రారంభించారు. కోట నుంచి పట్టణ పురవీధుల్లో పాదయాత్ర చేశారు. వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారని సుజయ్‌కృష్ణ రంగారావు, బేబినాయన, తెంటు రాజా విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు. పాదయాత్రకు బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, జనం పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

గుర్ల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గ్రామాల్లో ప్రజల సమస్యలను సభ దృష్టికి తేవడంలో ఒకరిద్దరు తప్ప మిగిలిన ఎంపిటిసిలు, సర్పంచులు పాత్ర నామ మాత్రంగా ఉంది. అధికారుల తీరుపై ఎంపిపి అసహనం వ్యక్తం చేశారు. నాడు నేడు పనులను జూన్ నెల చివరికి పూర్తి చేయాలని సంబంధిత జెఇకి తెలిపారు. జల జీవన్ మిషన్ పథకంలో చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాగోలు, గొలగాం గ్రామాలకు 104 వాహనం రావడం లేదని ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, బెల్లాన బంగారు నాయుడు, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

డెంకాడ : పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఇతర టెక్నికల్ వర్కర్లకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బచ్చల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు చెల్లించకపోగా కార్మికులపై దుర్భషలాడటం సరికాదన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రూ.10వేలు చెల్లిస్తామంటూ ఇచ్చిన జిఒ 680 ఇంత వరకూ అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు.

ఘనంగా జువ్వాలమ్మ పండగ

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామదేవత జువ్వాలమ్మ తల్లి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాలను పూజారి పురవీధులలో మేళ తాళాలతో ఊరేగించారు. ఈ ఊరేగింపు సింగరాయి, కొత్త సింగరాయి, అప్పన్నపాలెం, దిబ్బన్నపాలెం, వెంకయ్యపాలెం నిర్వహించారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవం భారీ మందు గుండు కాల్పులతోనూ, పులి వేషాలు, కాంగో నృత్య ప్రదర్శనలు, కర్ర సాము, తప్పెడగుళ్ళు, కోలాటాలతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్ వెంకటరావు, గ్రామ పెద్దలు, యువకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల పండగ

భోగాపురం: మండలంలోని నందిగాం పంచాయతీ గరి నందిగాం గ్రామ దేవతలు దుర్గాలమ్మ, బంగారమ్మ, పాదాలమ్మ పండగ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా గ్రామ ప్రజలు ఈ పండగను నిర్వహించుకుంటారు. ఇందులో భాగంగా మొదటి రోజు తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. మంగళవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారని సర్పంచ్ గరే మురళీ మోహన్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

శృంగవరపు కోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు తెలిపారు. కళాశాలలో ఉన్న బిఎ, బికామ్, బిఎస్‌సి, బిజెడ్‌సి కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాల ఆఫీసు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

22న కలెక్టరేట్ వద్ద ధర్నా

లక్కవరపుకోట : గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని గంగుబూడి చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో సమావేశమై ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకపూట పని విధానాన్ని అమలు చేసి వేసవి అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు కలిపించి రూ. 600 కూలి ఇవ్వాలన్నారు. ఇటువంటి అనేక సమస్యలపై చేపట్టనున్న ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డిఎస్‌పిని కలిసిన టిడిపి నాయకులు

బొబ్బిలి: బొబ్బిలి డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీధర్‌ను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన డిఎస్‌పికు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బొబ్బిలిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పువ్వల శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు కె.వెంకటరావు, ఎస్.సాయిరమేష్ పాల్గొన్నారు.

దళితులకు పట్టాలివ్వాలి : సిఐటియు

బాడంగి : దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో వారికి పట్టాలివ్వాలని సిఐటియు నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూడువలస గ్రామ దళితులు సుమారుగా 20 సంవత్సరాల నుండి కోడూరు రెవెన్యూ పంచాయతీలో ఉన్న సర్వేనెంబర్ 99,100,101,111 భూమిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. 2004లో అప్పటి తహశీల్దార్ దళిత కుటుంబాలకు 7.22 ఎకరాల భూమిని అడంగల్ పేపరు ఆధారంగా ఇచ్చి సాగు చేసుకోమని చెప్పారన్నారు. అయినా సరే ఇప్పటివరకు దళితులకు శాశ్వత భూహక్కు పట్టా ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, ఇతర పథకాలకు దళితులు అనర్హులుగా ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ పూడివలస దళితులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

బొబ్బిలి : నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎరుకుల పేటలో ఉన్న పేదలకు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వాసు, బి.సంతోష్ తెలిపారు. పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

దోపిడీ చేస్తున్న కళాశాలలపై చర్యలు

బొబ్బిలి రూరల్ : పట్టణంలో ఉన్న పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల నుండి అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.3వేలు నుంచి రూ. 4 వేలు వరకూ ఒక్కో విద్యార్థి నుండి వసూలు చేస్తున్నారని అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల ఉప తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బి. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల విధానాన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలు, పూర్తిగా పాటించడం లేదన్నారు.

గిరిజన గ్రామంలో వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని కరకవలస పంచాయతీ గిరిజన గ్రామమైన మారిక గ్రామంలో వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 68 మందికి వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్నపిల్లలు, గర్భిణులు వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరావు సూచించారు. శిబిరంలో సిబ్బంది బి లక్ష్మి, ఎస్ రమ్య, ఏఎన్ఎంలు, ఎంఎల్‌పిహెచ్, సర్పంచ్ పి పెంటమ్మ, డి అప్పన్న పాల్గొన్నారు.

సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంలో బోర్లు మరమ్మతులు

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం లో భాగంగా సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్ ఆధ్వర్యంలో బోర్లు మరమ్మత్తులు సోమవారం చేపట్టారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంలో ఇప్పటి వరకు 11 గ్రామ పంచాయతీలలో 28 బోర్లు మరమ్మత్తులు చేపట్టినట్లు జెఇ తెలిపారు. మిగిలిన పంచాయితీలో ఫిర్యాదులు వస్తే తక్షణమే బోరులు మరమ్మత్తులు చేపడతామని వెల్లడించారు.

పలుచోట్ల టిడిపి సంఘీభావ ర్యాలీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట, వేపాడ

టిడిపి యువ నాయకులు గొంప కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంఘీభావ పాదయాత్రకు విశేష స్పందన లభించింది. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి 100 రోజులు పూర్తయిన సందర్భంగా వేపాడ మండలం బొద్దాం గ్రామం నుండి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి మహిళల కోలాటాలు, బాణాసంచా కాలుస్తూ స్థానిక దేవి కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహం వరకు పాదయాత్రను నిర్వహించారు. మార్గం మధ్యలో మండలంలోని వెంకటరమణ పేట జంక్షన్ వద్ద ఆ గ్రామ టిడిపి నేతలు ఏర్పాటు చేసిన భారీ కేకును గొంప కృష్ణ కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం పట్టణంలోని దేవి కూడలిలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని నారా లోకేష్ పాదయాత్ర మిగిలిన 300 రోజులు సుఖంగా సాగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదయ ప్రాంగణంలో 116 కొబ్బరికాయలను కొట్టి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఐదు మండలాల నుండి టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేపాడ: ర్యాలీ నిర్వహిస్తున్న గొంప కృష్ణ, తదితరులు

గజపతినగరం: రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చి సర్వనాశనం చేశారని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం నుండి బొండపల్లి మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు టిడిపి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శివ్వాల సూర్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, సీనియర్ నాయకులు పివివి గోపాల రాజు, మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, కొండపల్లి బాస్కరనాయుడు, పి.స్వామి నాయుడు, పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇంచార్జిలు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల కమిటీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు, యువత,మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నారా లోకేష్ యువగళం పాదయాత్ర టిడిపి గెలుపునకు నాంది కావాలని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. సోమవారం నారా లోకేష్ యువ గలం పాదయాత్ర 100రోజుల సందర్భంగా టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో రామ తీర్థం జంక్షన్ నుంచి కొత్తపేట, గొర్లి పేట, సీతారాముని పేట, రామతీర్థం, దేవుని నెలివాడ వరకు టిడిపి శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సంధర్భంగా కర్రోతు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనతో రాష్ట్రం అదోగతి పాలయ్యిందని దీన్ని ప్రజలకు తెలియ పర్చడానికి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, సీనియర్ జిల్లా నాయకులు సువ్వాడ రవి శేఖర్, మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

కొత్తవలస: యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న నారా లోకేష్‌కు సంఘీభావంగా సోమవారం మండలంలోని చింతలపాలెం నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, శ్రీభరత్ మాట్లాడుతూ మండలంలో ఆరు కిలోమీటర్ల సంఘీభావ పాదయాత్ర నిర్వహించామన్నారు. ఈ పాదయాత్ర చింతలపాలెం, తాడివాన పాలెం, దేశపాత్రునిపాలెం, మంగళ పాలెం, కొత్తవలస మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు జరిగిందన్నారు. అనంతరం కొత్తవలస జంక్షన్‌లో అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలవేసి పాదయాత్రను ముగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల అప్పల రాంప్రసాద్, కోళ్ల శ్రీను, తిక్కన చిన్నదేముడు, మాకేన సీతారాం పాత్రుడు, కలకాల శివ, తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్పందన వినతులు వెంటనే పరిష్కరించాలని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన స్థానిక 3,5 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతీరోజూ అన్ని సచివాలయాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు తప్పనిసరిగా స్పందన నిర్వహించాలని తెలిపారు. సమయపాలన, యూనిఫాం, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాత వస్తువుల సేకరణ

నగర పంచాయతీ పరిదిలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా మే 20 నుండి 30వ తేదీ వరకు పది రోజులపాటు రీ సైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు చెప్పారు. ఈ అంశంపై స్థానిక నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు, వివిధశాఖల అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాత వస్తువుల సేకరణ కోసం నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా స్టాల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానికంగా ఉండే ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉండి రీసైకిలింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆ స్టాల్ వద్దకు అందజేయాలని కోరారు.

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

గణేష్ పండాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని మైలాన్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ యూనియన్ లీడర్ ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు గణేష్ పండాపై మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజు అధ్వర్యంలో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ 2007 నుండి మైలాన్ లేబరేటరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్‌ను తమ అధ్యక్షలైన గణేష్ పండా ఆధ్వర్యంలో రిజిష్టర్ చేయించుకున్నామని చెప్పారు. అయితే తమ అధ్యక్షడు పరిశ్రమ యాజమాన్యంతో చేతులు కలిపి తమకు అన్యాయం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయకుండా యాజమాన్యంతో కుమ్మక్కై, తమ డిమాండ్స్ నెరవేర్చ కుండా మాయ మాటాలు చెప్పి పబ్బం గడుపు కుంటున్నాడన్నారు. ఏటా ఒక్కొక్క కార్మికుడు నుండి రూ. 220లు సభ్యత్వం వసూలు చేసి లెక్కలు మాయం చేసాడన్నారు. ఒకే రిజిస్ట్రేషన్ నెంబర్‌పై మైలాన్ లేబర్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, పూసపాటిరేగ మండల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అని రెండు యూనియన్‌లును స్థాపించి మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు సంవత్సరాలకు యాజమాన్యంతో జరగాల్సిన అగ్రిమెంటు తమ అనుమతి లేకుండా కొంతమంది సభ్యులును గుడివాడ అప్పలనాయుడు, ఎస్. రమణ, గొర్లె వెంకటరమణ, టి. సత్యనారాయణ మిగతా పదిమంది సభ్యులు ఏకస్తులై మూకుమ్మడిగా మమ్మల్ని మోసం చేస్తున్నారన్నారు. పోలీసులు తమ యూనియన్ అగ్రిమెంటు కాఫీలును, రికార్డు రిసిప్ట్ బుక్స్, బ్యాంకు అకౌంటు సీజ్ చేసి దీనిపై తగు ధర్యాప్తు చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. తమకు తెలియకుండా యూనియన్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి మోసం చేసిన సభ్యులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

20న ఆనందోబ్రహ్మ

ప్రజాశక్తి- బొబ్బిలి

యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో సకల కళావేధిక ఆనందోబ్రహ్మ 12వ నెల ప్రదర్శన మే 20 శనివారం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహన్‌రావు బుధ వారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ స్థానిక శ్రీ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తు న్నట్లు ఆయన సోమవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 11 ప్రదర్శనలు నిరవ ధికంగా ఇచ్చామని, ఈ 12వ ప్రదర్శనలో అన్ని రంగాల పౌరాణిక, చారిత్రక, సాంఘిక, జానపద కళలనీ ప్రతి బింబించే ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కేవలం పది రూపాయల టికెట్‌తో అన్ని వయసుల వారిని అలరించే విధంగా రెండు గంటలసేపు రూపొందించిన ఈ ప్రదర్శలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని తెలిపారు. ప్రారంభం నుండి ఇప్పటి వరకు దాదాపు 2,500 మంది కళాభిమానులు తమ ప్రదర్శనలు తిలకించడం వల్ల రంగస్థలం ప్రదర్శనలకు ఆదరణ పెరుగుతోందన్న విషయం సంతోషకరమని అన్నారు. ఆసక్తిగల అన్ని వయసుల ఔత్సాహిక కళాకారులు తమను 9440744741లో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ఏన్నా బాబు, డి.వి.అప్పారావు, రాముద్రీ, గంగాధర్, కరుణ, పవిత్ర, నాగరాజు, వెంకట రమణ, లాయర్ గంగాధర్, రాంబాబు పాల్గొన్నారు.

సాంకేతికత వారోత్సవాల్లో ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరిగిన 'జాతీయ సాంకేతికతా వారోత్సవం 2023'లో ఎపి నుంచి మండలంలోని ధర్మవరం పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వ్యవసాయ వ్యర్థాలతో బ్యాగులు తయారీ (పేపర్ అండ్ ప్లాస్టిక్ ఫ్రీ ప్యాకింగ్) ప్రాజెక్టును వారు ప్రదర్శించినట్లు పాఠశాల విద్యాశాఖ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 40 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు పాల్గొనగా, మన రాష్ట్రం నుంచి ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు ఈ అవకాశం దక్కింది. తొమ్మిదో తరగతి చదువుతున్న వానపల్లి యశస్విని, మండా మాధురి, వెదురుపర్తి వరప్రసాద్ గైడ్ టీచర్ వానపల్లి రమేశ్ పాల్గొని ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన పేపర్ ప్లేటులు, ప్లాంట్ పాట్స్, హ్యాండ్ బ్యాగులు, స్టేషనరీ ఫైల్స్, గిఫ్ట్ ప్యాకింగ్ బాక్సులు వంటివి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, కేంద్ర మంత్రులు, శాస్త్రవేత్తలు తదితరులు తిలకించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డిఆర్‌డిఒ చైర్మన్ సతీష్‌రెడ్డి

'మండే' సూర్యుడు

- భానుడు భగ భగతో ప్రజలు విలవిల
- కానరాని చలి వేంద్రాలు

మెరక ముడిదాం: మండలంలోని సోమవారం ఉదయం నుంచే భానుడు భగ భగమని మండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన వడ గాడ్పులు వీచడంతో ప్రజలు విల విలలాడిపోయారు. ఉదయం పదిన్నర ప్రాంతంలోనే ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల రోడ్ మీద ఒక్క మనసి కూడా కన్పించ లేదు. ఎండలు ఎక్కువుగా ఉండటంతో, చెరువులలోని నీరు కూడా అడగంటి పోతున్నాయి. ఇంత తీవ్రంగా ఎండలు ఉన్నప్పటికీ మండల కేంద్రంతో పాటు గ్రామాలలోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం పాదచారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సేవకులు చలి వేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తారని ఎదురు చూస్తున్నారు. సోమవారం అత్యధికంగా 47 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో ఎవరూ రోడ్ మీదకు రాలేదు. దీంతో పలు గ్రామాలు నిర్మానుష్యంగా కనిపించాయి. ప్రజలు ఎవరు తిరగక పోవటంతో, వస్త్ర వ్యాపారస్తులు, చిల్లర కొట్టు వ్యాపారస్తులు, కిరాణా వ్యాపారాస్తులు, బేరాలు లేక దిక్కులు చూస్తూ కూర్చోవటం కన్పించింది. ఏమైనా భానుడు భగ భగ మండటంతో, ప్రజలు విల విలలాడిపోయారు.

నిర్మానుష్యంగా ఉన్న బైరిపురం బస్‌స్టాప్ రోడ్డు

వైసిపిలో గుర్తింపు లేదు

బొబ్బిలి: కష్టపడి పనిచేసే వారికి వైసిపిలో గుర్తింపు లేదని బాడంగి మండల వైసిపి అధ్యక్షులు పూడి జగదీశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో పనిచేసిన వారికి గుర్తింపు లేదన్నారు. పైగా పెట్టుబడులు పెట్టి అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించడం లేదన్నారు. 2017 నుంచి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన తనను నమ్ముకున్న కార్యకర్తలకు ఎటువంటి మేలు చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకనే ఆ పార్టీని వీడి బిజెపిలో చేరి ప్రజలకు మేలు చేయాలనుకుంటున్నానని వెల్లడించారు.

స్థలం మంజూరు చేయాలి

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రంథాల యానికి స్థలం మంజూరు చేయాలని నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు కోరారు. సోమవార గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఆయన తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వైస్ ఛైర్మన్ రామారావు మాట్లాడుతూ ఇంత వరకు గ్రంధాలయం తమ గ్రామంలో భారత్ యూత్ ఫెడరేషన్ భవనంలో నడుస్తుందన్నారు. పాఠకులకు సౌకర్యాలు చాలక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా స్థానిక జెడ్‌పి పాఠశాల ఎదురుగా 8సెంట్లు ప్రభుత్వ స్థలం ఉందని ఆ స్థలం గ్రంథాలయానికి కేటాయించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబ శివ రావు, పోలుబోతు నారాయణ మూర్తి ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - జామి

జామి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. సోమవారం వేసవి విజ్ఞాన శిబరంలో పద్యాలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మిడతాన శ్రీనివాసరావు, గోపి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో 32మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి బి. మేరీ నిర్మల ఆధ్వర్యంలో కార్యక్రమ జరిగింది.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

శృంగవరపుకోట: ఈ నెల 18న చంద్రబాబునాయుడు నియోజకవర్గం పర్యటన సందర్భంగా మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయం నుండి సోమవారం వచ్చిన ప్రోగ్రామింగ్ కమిటీ పర్యవేక్షకులు గంటా గౌతమ్ ఏర్పాట్లును పరిశీలించారు. నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో ప్రణాళికా ఏర్పాట్లు గురించి చర్చించారు. ప్రధానంగా చంద్రబాబు బహిరంగ సభా ప్రాంగణ స్థలం, కొత్తూరు శివాలయం నుండి దేవి గుడి వరకు రోడ్‌షో రూట్ మ్యాప్, 18 రాత్రి బస చేసే శిరికి గ్రీన్ సిటీలో ఉన్న రూమ్ పెసిలిటీ, ట్రాఫిక్, పోలీస్ భద్రతా నియంత్రణా చర్యలు వంటి వివిధ అంశాల మీద చర్చించారు. అనంతరం ప్రోగ్రామింగ్ కమిటీ పర్యవేక్షకులతో పాటుగా రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాబిన్ శర్మ టీమ్, మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొట్టాన విజయ్ కుమార్, నాయకులు చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, లాలం అర్జునరావు, చెక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాల ఈశ్వర్ భరత్, శ్రీనాథు రాజేష్, అక్కిరెడ్డి వెంకటరమణ తదితరులున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రోగ్రామింగ్ కమిటీ

సమన్వయంతోనే అభివృద్ధి

రేగిడి : సచివాలయం ఉద్యోగులు సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి చేపట్టాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రాప్తికి పనులు జరిపి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతో మండల జెఇ రామకృష్ణ, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ ఉన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మెట్ట మగ్గూరు గ్రామంలో ఓ వీధిలో ఒకరు రోడ్డుపై రాళ్ళు వేసి ఆక్రమణకు గురిచేస్తున్నారని దీని వల్ల తమకు ఇబ్బంది జరుగుతుందని ఆ గ్రామానికి చెందిన గౌరునాయుడు ఫిర్యాదు చేశారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన స్పందనలో ఎంపిడిఒ శ్రీనివాసరావుకు ఆయన వినతినిచ్చారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఆక్రమణను తొలగించి రోడ్డు నిర్మించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
IP NO : 02/2023

Between:
1. Battula Adinarayana, S/o Veerabadrudu, Aged about 60 years, Hindu, R/o Door No-27-70 Devara Street, Nallimarla Post, Vizianagaram District.
2. Battula Nagamani, W/O Battula Adinarayana, Aged about 56, Hindu, R/o Door No-27-70 Devara Street, Nallimarla Post, Vizianagaram District.
.....Petitioners

And:
1. Ippili Lakshmi, D/o Trinadh, aged about 40year, Hindu, R/o Kirthi Street, Nellimarla (M), Vizianagaram Dist.
2. Bireddi Pudinaidu, S/o Rajinaidu, aged about 55 years, Devangula Street, Nellimarla Post, Vizianagaram Dist.
3. Allu Satyavathi, W/o Late Rambabu, Aged about 40 years, Hindu, R/o Allu Street, Salur Mandal, Vizianagaram.
4. Naidana Annapurna, W/o Ramana, aged about 50years, Hindu, R/o Allu Street, Salur Town,
5. Sidagana Manga, W/o T.Tirupathi Rao, Hidu, aged 40years, R/o Gollaveedhi, Saluru, Vizianagaram Dist.
6. Nammi Ramakrishna, S/o Chandarao, aged about 42years, R/o D.No. 4-10-37, Near Ramamandiram, Kuppiliveedhi, Vizianagaram.

ఇందలి పిటిషనర్ శ్రీ కోర్టువారి వద్ద తనను ఇన్ సాల్వెన్సీగా డిక్లేర్ చేయమని కోరుచూ దాఖలు చేసిన దావాలో మీ యొక్క ఆక్షేపణలు దాఖలు చేయుటకు **తే.20/07/2023న ఉదయం 10-30 గంటల**కు మీరు గానీ మీ తరపు లాయరు ద్వారా గాని దాఖలు చేయవలెను. అట్లు కానిచో ఉన్న ఆధారాలతో మీ పరోక్షంలో తీర్మానం జేయడమగునని ఇందుమూలకంగా తెలియజేయడమైనది.

A.P.Aswani Kumar
Advocate, Vizianagaram
Cell: 8247288975

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : వృద్ధురాలు మృతి

రామభద్రపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం మండలం లంకాజోడికి చెందిన హిమరిక సాయమ్మ(75) ఆటో ప్రమాదంలో సోమవారం మృతి చెందింది. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు తన కుమారుడు తిరుపతిరావుతో కలిసి విజయనగరం జిల్లా నెలిమర్లకు ఆటోలో వెళుతుంది. ఈ సమయంలో ఆరిక తోట జాతీయ రహదారి పక్కన ఉన్న బాలాజీ లాడ్జ్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బ్రేక్ వేయగా ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న సాయమ్మ ఎగిరి రహదారిపై పడటంతో తల బలంగా రోడ్డును గుద్దుకుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు తిరుపతిరావు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

గుర్ల: మండలంలోని వల్లాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 217 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరి బాబు నాయుడు తెలిపారు.

4 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద సోమవారం నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా, తాడూరు మండలానికి చెందిన హీరా విక్రమ్, బంగారు వేణు ఇద్దరు నిందితులు అరకులో గంజాయి కొని తీసుకొస్తుండగా పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

350 కిలోల పిడిఎస్ బియ్యం పట్టివేత

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి మధుర గ్రామమైన దిబ్బవానిపేటలో పైడిపల్లి సూర్య నారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న పిడిఎస్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉన్నాయని ఫిర్యాదు అందడంతో రైడ్ చేసి 350కిలోల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేసిననట్లు సిఎస్‌డిటి మురళీ తెలిపారు.

గుర్ల : మండలంలో తాటిపూడి గ్రామంలో విజిలెన్స్ అధికారులు, సిఎస్‌డిటి కలసి చేపట్టిన తనిఖీల్లో 13 క్వింటాలు పిడిఎస్ బియ్యం సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటి శోభ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి కుసుమంచి మహేశ్వరరావుపై కేసు నమోదు చేసి బియ్యం బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు.